# 'థిక్‌స్కిన్‌డ్‌'!

"భాస్కరమూర్తి నీకు గుర్తున్నాడా?" అడిగాడు మా తమ్ముడు, వాడి ఫ్రెండు శ్రీహరిని.

"ఎందుకు లేదూ? మనింటికి ఎదుటి వాటాలో వుండే వారు కదూ? అబ్బబ్బబ్బ? ఏం టెక్కు మనుషులు? నీకు గుర్తుందో లేదో మనిద్దరం కలిసి కబుర్లు చెప్పుకుంటూ వుంటే తన వయస్సు కాకపోయినా తనతో సంబంధం లేకపోయినా మధ్యలో దూరి, ఏవేవో వాగేవాడు" అన్నాడు మా వాడు టింకూ! వాళ్ల సంభాషణలిని భాస్కరమూర్తి గురించి కొంచెం తెలుసు కనుక వింటూ వొచ్చాను వాళ్ల మాటలు!

ఒకసారి శ్రీహరి తమ్ముడు కూరల మార్కెట్టు కెళ్ళి కూరలు కొనుక్కునొస్తున్నాడట! వారు చేతిలో వున్న ములక్కాడలు చూసి, చాలా బావున్నాయిరా, లేతగా ఎంతక్కొన్నావ్?' అని అడిగాట్ట భాస్కరమూర్తి.

'రూపాయికి అయిదు. రెండు రూపాయలవి కొన్నాను! అన్నాట్ట అతడు.

'ఒరేయ్! నీకు రెండు రూపాయలిస్తా గానీ అవి నాకిచ్చేయ్!' నువ్వు కుర్రాడివి. మళ్లీ వెళ్లి తెచ్చుకోగలవు. నేను వెళ్లలేనురా' అంటూ సమాధానం కోసం ఎదురు చూడకుండానే చేతిలోని ములక్కాడలు తీసుకుని డబ్బులకోసం జేబులో చేతులు పెట్టేడట. కాస్సేపు ఆ జేబూ, ఈ జేబూ చూసి "అరె! చిల్లర లేదురా! రేపిస్తాలే! ఏమీ అనుకోకూ..." అంటూ వెళ్లిపోయాట్ట. ఆ రోజున వాడికి ఇంట్లో బాగా తలంటి పోసింది వాళ్లమ్మగారూ అలా ఎలా ఇచ్చేశారు. నువ్వు కొన్న ములక్కాడలు అంటూ. అప్పటికీ ఇప్పటికీ భాస్కరమూర్తి వాణ్ణికొన్ని పందలసార్లు కలిసినా, ఆ రెండు రూపాయల ఊసుగానీ, ములక్కాడల ఊసుగానీ ఎత్తడు. అలాగే ప్రతీవాళ్లదగ్గరా ఏదో ఒకటి కొట్టేస్తూ వుంటాడు. వాళ్లు తిట్టినా పట్టించుకోడు. మరొకరయితే అందరూ అనే మాటలకి సిగ్గుతో

చచ్చిపోతారు. భగవంతుడు భాస్కరమూర్తి చర్మం ఎంత దళసరిగా పెట్టాడో గానీ అంత థిక్ స్కిన్‌డ్ మనిషిని మనం ఎక్కడా చూడం!

వాడి జుట్టు ముడివీడికీ, వీడి జుట్టు ముడి వాడికీ పెట్టి ఆనందించేవారిలో భాస్కరమూర్తి మొదటివాడు. స్థలాలు కొనడం, స్థలాలు అమ్మడం, ఆ లావాదేవీలన్నింటిలో, అతడు ఒకరి తలమీద చెయ్యి పెడుతూ ఒచ్చాడే గానీ, తను ఎవరిచేతా తలమీద చెయ్యి వేయించుకోలేదు. ఎంత చిన్నవాడిలోనైనా సరే నోట్లో నోరు పెట్టి నానా బూతులూ తింటూ నానా బూతులూ అంటూ కార్యాన్ని సాధించేవాడు. సిగ్గన్నది అతని డిక్షనరీలో లేదు. పైన బురదలో పడిందీ అంటే బురదంతా కెలికి కెలికి పైసని పైకి తీసే దాకా నిద్దరపోయేవాడు కాదు. అందుకనే ఈ రోజున భాస్కరమూర్తికి రెండు మారుతీ కార్లూ, నాలుగు మూడంతస్తులు భవనాలూ వున్నాయ్! భాస్కరమూర్తి దగ్గర స్థలం కొన్న ప్రతివాడూ ఏ గొడవా లేకుండా ఇల్లు కట్టుకోలేదు.

"డబ్బు సంపాదించే వాళ్లందరూ 'థిక్ స్కిన్‌డ్' అని నేననుకొనీ 'థిక్‌స్కిన్‌డ్' వాళ్లు ఎలాగో అలాగ బతికి పోతారు" అన్నాడు టింకూ.

అంతలో మోసుకొచ్చాడు వేణూ ఒక వార్త!

వేణూ, టింకీ శ్రీహరీ వాళ్ల ఫ్రెండు. "ఒరేయ్! ఒక్క స్థలాన్నే ఇద్దరు వేరు వేరు వ్యక్తులకి ఒకరికి తెలీకుండా ఒకరికి అమ్మేట్ట. భాస్కరరామ్మూర్తి వాళ్లిద్దరూ మొదట్లో ఈ స్థలం నాది అంటే నాదీ అని తన్నుకున్నార్ట. ఆ తరవాత అసలు సంగతి తెలుసుకుని ఇద్దరూ వెళ్లి భాస్కరమూర్తికి బడితపూజ చేశాడట!"

"అరెరె! అయితే కాస్త అతగాడి పొగరణిగి బుద్ధొచ్చుంటుంది. ఒకసారి కావాల్లే అలాగ మళ్లీ చెయ్యడు ఇంకెప్పుడూ ఇటువంటి పాపిష్టి పన్లు"

పకపకా నవ్వాడు వేణు.

"ఎందుకు నవ్వుతున్నావ్?" అడిగాడు టింకూ.

"అంత బడితి పూజ జరిగాక వాడు హాయిగా నవ్వుకుంటూ తాజ్‌మహల్

కొచ్చి టిఫిన్ చేస్తూ కూర్చున్నాడు".

"నిజంగానా?" కళ్లు రెపరెపలాడించాడు ఆశ్చర్యంగా శ్రీహరి.

"అంతేకాదు! ఇంకెవరితోనో మరో స్థలం అమ్మకం గురించి మాట్లాడుతున్నాడు" అన్నాడు టింకూ.

"మైగాడ్!" అంటూ నోరు తెరిచారు అంతా!

"సిగ్గు, లజ్జా, బిడియం, ఇవన్నీ ఒదిలేసిన వాడే అంతస్థులు కడతాడు, అందల మెక్కుతాడు. న్యాయం నీతీ భీతీ అవన్నీ ఈ రోజుల్లో పనికిరాని పదాలు.

సొంత లాభం కొంతైనా వీడకుండా పొరుగు వాడిని చావబాదైనా చితకమొత్తైనా అనుకున్నది సాధించి తీరూ.

సంపాదన పెంచుకుంటూ పో! అదే లక్ష్యంగా పెట్టుకున్న వాడే 'సోకాల్డ్' పైకొస్తున్నారు" అన్నాడు శ్రీహరి.

'అంత' థిక్ స్కిన్డ్'గా మనం వుండలేము బాబూ' అన్నాడు టింక్

అమ్మ అందరికీ కాఫీలందించడంలో భాస్కరమూర్తి ప్రస్తావన మాని కాఫీ తాగడంలో నిమగ్నులయ్యారు అంతా! ★